ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

3★

మంగళవారం 19 నవంబరు 2024

న్యూస్ బాక్స్

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

అంతర్గాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీపీసీ జ్యోతినగర్‌లో ఈ నెల 23, 24తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం రామాచారి కోరారు. సోమవారం అంతర్గాం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద పార్టీ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి ఈ మేరకు మాట్లాడారు. మహాసభలలో గడిచిన మూడేళ్ల కాలంలో సీపీఎం నిర్వహించిన ప్రజా ఉద్యమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు కార్మికులు, అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొంతుల పోచం, మార్త పోచం, కండె శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైనర్లకు మద్యం అమ్మిన వైన్‌షాప్‌పై ఫిర్యాదు

మంథని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మైనర్లకు మద్యం అమ్మిన స్థానిక ఆర్ఆర్ వైన్స్ షాపు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎక్సైజ్‌శాఖ పెద్దపల్లి సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేసినట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేన క్రాంతికుమార్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మైనర్లకు మద్యం అమ్మిన షాపు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



వ్యవ'సాయాని'కి కేంద్ర నిధులేవి?

- రెండేళ్లుగా అమలుకాని ఆర్‌కేవీవై
- సబ్సిడీపై రైతులకు అందని యంత్ర పరికరాలు
- ఫసల్ బీమా యోజనకు నోచుకోని రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పే కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల కింద ఇవ్వాల్సిన నిధులను రెండేళ్లుగా విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై), పరంపరాగత్ కృషి వికాస్ యోజన పథకాల ద్వారా ఎలాంటి నిధులను కేటాయించడం లేదు. వ్యవసాయ రంగంలో రోజురోజుకు యంత్రాల వినియోగం పెరిగిపోతున్నది. యంత్రాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సబ్సిడీ పథకాలను తీసుకువచ్చాయి. అలాగే బీమా పథకాలు, తదితర పథకాలను తీసుకువచ్చాయి. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం ద్వారా సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ కోసం పవర్ వీడర్లు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, పవర్ స్ప్రేయర్లు తదితర పరికరాలు అందజేసేవారు. కానీ రెండేళ్ల నుంచి వ్యవసాయానికి సబ్సిడీ యంత్రాలు రైతులకు అందిన దాఖలాలు లేవు. దీంతో రైతులు బ్యాంకులు, సహకార సంఘాల రుణాలు పొందడం వల్ల గానీ, సొంత డబ్బులు వెచ్చించి గానీ యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు. గడిచిన బీఆర్ఎస్ పాలనలో మూడేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేసి సబ్సిడీపై పెద్దఎత్తున ట్రాక్టర్లు అందజేశారు. ఆ తర్వాత ఆ పథకానికి నిధులను కేటాయించలేదు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ప్రధాని ఫసల్ బీమా యోజన పథకం కూడా రాష్ట్రంలో మూడేళ్ల నుంచి అమలు కావడం లేదు. ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు రైతులు కూడా తమ వాటా కింద ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. వానాకాలం సీజన్ ఆరంభంలోనే రైతులు పంట రుణాలు తీసుకునే సమయంలోనే రైతుల వాటా కింద చెల్లించి ప్రీమియం సొమ్మును కట్ చేసుకునే వారు. పథకం అమలులో మార్పులు, చేర్పులు చేయాలని, ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతినే పంటలకు బీమా కంపెనీలు పరిహారం చెల్లించడం లేదని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. కేంద్రం చేర్పులు, మార్పులు చేయకపోవడంతో ఫసల్ బీమా పథకం నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైదొలిగింది. దీంతో మూడేళ్లుగా రాష్ట్రంలో పంటల బీమా అమలు కావడం లేదు. గత ఏడాది

మిగతా 6వ పేజీలో

● సేంద్రియ ఎరువుల వాడకంపై శిక్షణ కరువు

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పరంపరాగత్ కృషి వికాస్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. వివిధ రకాల పంటలకు వచ్చే చీడపీడల నివారణకు పెస్టిసైడ్స్ గాకుండా జీవామృతం, ట్రైకోగామ, ట్రైకో విరిడి తదితర సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసే ఎరువులను వాడే విధంగా రైతులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తారు. ఈ శిక్షణ తరగతులకు కేంద్రం నిధులు విడుదల చేయక పోవడంతో రైతు శిక్షణా కార్యక్రమాలు కుంటుపడ్డాయి. దీంతో రైతులు సేంద్రియ ఎరువులను వాడకానికి బదులు కెమికల్స్‌తో తయారుచేసే ఎరువులు, మందులనే వాడుతున్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

- 50.93 శాతమే అభ్యర్థుల హాజరు



జేఎన్‌టీయూలోని పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజులుగా జరుగుతున్న గ్రూప్- 3 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు అభ్యర్థులు కేవలం 50.93 శాతం మాత్రమే హాజరయ్యారు. సోమవారం ఉదయం జరిగిన మూడో పేపర్ పరీక్షకు 4,514 మంది అభ్యర్థులు హాజరు కాగా, 4,433 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పెద్దపెల్లి జిల్లాలో మొత్తం 8,947 మంది అభ్యర్థులకు 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆదివారం ఉదయం జరిగిన మొదటి పేపర్ పరీక్షకు 4,557 మంది అభ్యర్థులు హాజరు కాగా, 4,390 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో పేపర్ పరీక్షకు 4,440 మంది అభ్యర్థులు హాజరు కాగా, 4507 మంది అభ్యర్థులు హాజరు కాలేదు. కలెక్టర్ జిల్లాలోని పలు కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రామగిరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన గ్రూప్-3 పరీక్షల్లో 36శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. సోమవారం జరిగిన పరీక్షల్లో 768మంది గాను 281 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంథని సీఐ బీ రాజు ఆధ్వర్యంలో రామగిరి ఎస్ఐ చంద్రకుమార్, ముత్తారం ఎస్ఐ నరేష్ బందోబస్తు నిర్వహించారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీపీ



పరీక్ష కేంద్రం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న సీపీ

కోల్‌సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను సోమవారం సీపీ శ్రీనివాస్ పరిశీలించారు. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్టీపీసీ సెయింట్ క్లేయిర్ పాఠశాలలో పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లు, పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపుపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో 66 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో గ్రూప్-3 పరీక్షలు జరిగాయని, పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట డీసీపీ(అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

పెద్దపల్లి మార్కెట్‌లో తగ్గిన పత్తి ధర

- క్వింటాలుకు అత్యధికంగా రూ.6,832

పెద్దపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తికి ధర పెరిగినట్లే పెరిగి మళ్లీ తగ్గుముఖం పట్టాయి. రెండురోజుల క్రితం వరకు క్వింటాలు పత్తికి అత్యధికంగా 7,071 ధర పలకగా, సోమవారం 6.832 రూపాయల ధర పలికింది. దాదాపు 240 రూపాయల ధర తగ్గడం గమనార్హం. మార్కెట్‌కు 285 మంది రైతులు 1123.10 క్వింటాళ్ల పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చారు. క్వింటాలు పత్తికి అత్యధికంగా 6,832 రూపాయలు, అత్యల్పంగా 5,958 ధర పలికింది. మోడల్ ధర 6657గా ఉంది.



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్

ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో వినతి

6



పొత్కపల్లి సమీపంలో చెట్లతో నిండిన ఉపకాల్వ

ఆనవాళ్లు కోల్పోయిన ఎస్సారెస్పీ ఉపకాల్వలు

- నీటి విడుదల సమయంలో గండ్లు పడే ప్రమాదం

6

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే విజయరమణారావు



రాంపల్లిలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్ల క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని, రైతులు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం మండలంలోని రాంపల్లి గ్రామంలో పెద్దపల్లి వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్నాలకు రూ.500 బోనస్‌ను అందిస్తున్నామని, రైతుల ఖాతాలో బోనస్ జమ అవుతున్న కూడా ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. రైతుల ఖాతాలో బోనస్ పడడం ప్రారంభమైందని రైతులెవరూ అధైర్యపడవద్దని సన్నవడ్లు సాగు చేసుకున్న ప్రతి ఒక్కరికి బోనస్ అందుతుందన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అలాగే ఎలాంటి కటింగ్‌లు లేకుండా ధాన్యం కొనుగోలు చేసే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ప్రతిగింజకు మద్దతు ధర చెల్లించి వడ్లను కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మాదిరెడ్డి నర్సింహారెడ్డి, సంపత్‌రావు, మాజీసర్పంచ్ కనపర్తి శ్రీలేఖ-ప్రభాకర్‌రావు, గన్నమా నేని తిరుపతిరావు, రమేష్, సతీష్, సింగిల్ విండో సీఈవో మధు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధర్మారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమేడారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మెన్ కొత్త నర్సింహులు, ఏఎంసీ వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, పాలకుర్తి రాజేశం పాల్గొన్నారు.

రామగిరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు తోట చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ చిందం మహేష్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, నాయకులు ఉడుత శంకర్, అరెల్లి కొమరయ్య, కాటం సత్యం, గాజుల శీను, సుధాకర్, తాటి సతీష్, మోత్కూరి వెంకటేష్, అజయ్, భూమయ్య మురళి, శ్రీధర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలి



సీఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఫైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): మంథని నియోజకవర్గంలో శాంతి భద్రతల సమస్య సృష్టించేలా వ్యవహరిస్తున్న నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు సోమవారం గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు హత్యకు కుట్ర చేశారని తప్పుడు ప్రచారం చేసిన చల్లా నారాయణరెడ్డి తో పాటు సోషల్ మీడియాలో అతడి వ్యాఖ్యలను వైరల్ చేస్తున్న సత్యనారాయణ గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీలు, కార్యకర్తల మధ్య ఘర్షణలకు దారితీసే విధంగా కుట్రపూరితంగా జరుగుతున్న ప్రచారాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సీఐని నాయకులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు


కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ హత్య కుట్ర పన్నారని సోమవారం బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చల్ల నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను పోలీసులు సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసి, పూర్తిస్థాయిలో విచారణ జరుపాలని, హత్య కుట్రకు సంబంధించిన విషయాలను ఫిర్యాదు పత్రంలో తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, నాయకులు బొల్లపల్లి శంకర్‌గౌడ్, దండే కిషన్, ఎలబోయిన రామ్మూర్తి, తోట రాజ్‌కుమార్ ఉన్నారు.

దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించే దేశవ్యాప్త నిరసనను విజయవంతం సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలను జిల్లా కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పోరేట్, మతోన్మాద విధానాలకు ప్రతిఘటనగా ఈనెల 26న దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలతో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు తోకల రమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అశోక్, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి భీమన్న పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిని అణచివేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల

గోదావరిఖని, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తుందని, ప్రశ్నించే వారిని అణిచివేస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. సోమవారం స్థానిక చౌరస్తాలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కలిసి ఆయన మాట్లాడారు. పోలీసులే ప్రభుత్వం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, న్యాయాన్ని రక్షించాల్సిన పోలీసులు అన్యాయం వైపు నిలిస్తున్నారని ఆరోపించారు. నలుగురు మహిళా కార్పొరేటర్లపై ఓ సీఐ అసభ్యపదజాలంతో దూషించడం దారుణమన్నారు. కృష్ణానగర్‌లో డిప్యూటీ మేయర్‌పై పెట్రోల్ పోసిన వ్యక్తిపై ఇప్పటివరకు పోలీసులు కేసు నమోదు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. లక్ష్మీనగర్, తిలక్‌నగర్ చౌరస్తాలో నిరుపేదలు నిర్మించుకున్న కట్టడాలను అక్రమంగా కూల్చివేస్తున్నారని, వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా రోడ్డున పడవేశారన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై కక్షగట్టి కూల్చివేస్తున్నారని, స్టే ఆర్డర్ ఉన్నా కుట్రపూరితంగా కార్పొరేటర్ పెంట రాజేష్ ఫంక్షన్‌హాల్‌ను కూల్చివేశారని, ఇది దౌర్జన్యం కాదా అని ఆయన ప్రశ్నించారు. రామగుండంలో పోలీస్‌రాజ్యం నడుస్తుందన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, కుమ్మరి శ్రీనివాస్, రమణారెడ్డి, కవిత సరోజిని, నాయకులు మెతుకు దేవరాజ్, రమేష్, రామకృష్ణ, శ్రావణ్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే వివరాలను పకడ్బందీగా సేకరించాలి



రాఘవపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే వివరాలను పకడ్బందీ గా సేకరించాలని జడ్పీ సీఈవో నరేందర్ అన్నారు. సోమ వారం పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్‌లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో నరేందర్ మాట్లాడుతూ ప్రతీ కుటుంబం వివరాలు పక్కాగా సేకరించాలని అధికారులకు సూచించారు. పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య గ్రామంలో చేపడుతున్న కుటుంబ సర్వేను పర్యవేక్షించారు. వారి వెంట పెద్దపల్లి ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతి కార్యదర్శి రవి, గ్రామ పంచాయతి సిబ్బంది, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

భూములకు పరిహారం ఇప్పించాలని ఆందోళన

- కలెక్టర్‌కు రైతుల వినతి పత్రం

పెద్దపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిళ్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ నుంచి సింగరేణి తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి తాము దున్నుకుంటున్న 355 ఎకరాల భూములను సింగరేణి సంస్థ ఓసీపీ 5 ప్రాజెక్టు కోసమని 2018లో లాక్కుందని చెప్పారు. ఇక్కడ ప్రాజెక్టు చేపడుతున్నామని, అవి తమ భూములేనని సాగు చేసుకోకుండా చేశారని, పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని అన్నారు. 2019లో మంథని రోడ్డు నిర్మించారని, 2022 జనవరిలో ఓసీపీ పనులను ప్రారంభించారని తెలిపారు. భూములకు పరిహారం ఇచ్చే విషయమై సింగరేణి అధికారులకు ఇబ్బందులకు గురి చేశారని, 2022 డిసెంబరు 30న గ్రామసభ నిర్వహించారని, గత ఏడాది ఆగస్టు 16న పరిహారం ఇస్తామని చెప్పి సంతకాలు తీసుకున్నారని తెలిపారు. ఎకరానికి 6.50 లక్షల రూపాయల చొప్పున ఇస్తామని చెప్పి, ఎన్నికల కోడ్ పేరిట ఏడాదిన్నరగా తాత్సారం చేశారన్నారు. నవంబరు 4న గ్రామంలో కమిటీ వేసి భూముల జాబితా తయారు చేస్తామని చెప్పి ఇప్పటివరకు కూడా కమిటీ వేయలేదని అన్నారు. సింగరేణి సంస్థ అధికారులు తమ భూములను తీసుకుని పరిహారం ఇవ్వకుండా ఐదేళ్లగా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు తమ భూములకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పత్తి రైతులకు ఇబ్బందులు కలగజేయవద్దు: కలెక్టర్



జిన్నింగ్ మిల్లులో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీహర్ష

సుల్తానాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లులకు వచ్చే పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగజేయకుండా నాణ్యమైన పత్తిని మద్దతు ధరపై కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సుల్తానాబాద్ మండలం వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లును సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిన్నింగ్ మిల్లులో పత్తిరైతులు తమ యొక్క పత్తిని సీసీఐకి అమ్ముకునే విధానంలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, జిన్నింగ్ ప్రాసెస్, జిన్నింగ్ మిల్లులో గల పత్తి స్టాక్స్ వివరాలను తెలుసుకున్నారు. పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, జిన్నింగ్ మిల్లులో మంచినీరు, టాయిలెట్లు ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పత్తిపంట 8 శాతం తేమ ఉంటే క్వింటాళ్ల 7,521 రూపాయల ధర వస్తుందని, 8 నుంచి 12 శాతం వరకు పెరిగే ఒక్కో శాతానికి 75 రూపాయల చొప్పున క్వింటాళ్లకు మద్దతు ధర తగ్గుతుందని వివరించారు. 12 కంటే ఎక్కువ తేమ శాతం ఉంటే కొనుగోలు చేయబోమని కలెక్టర్ తెలిపారు. పత్తి రైతులందరూ తమ యొక్క పత్తి తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండే విధంగా చూసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని సూచించారు. మంచి పత్తి, చెడు పత్తి కలవకుండా వేర్వేరుగా తీసుకొని రావాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి మనోహర్, సీసీఐ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు రైలు కిందపడి వృద్ధురాలి మృతి

ఓదెల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓదెల రైల్వే స్టేషన్‌లో సోమవారం పెద్దపల్లి మండలం కనగర్తికి చెందిన అరికిళ్ల నర్సమ్మ (60) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు ఇంటర్ సిటీ రైలు కిందపడి మృతి చెందింది. ఓదెలలోని తన బంధువుల ఇంటిలో పెద్దఖర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇంటర్ సిటీ రైలులోతన భర్త నర్సయ్యతో ఓదెలకు వచ్చింది. రైల్వే స్టేషన్‌లో రైలు నుంచి దిగుతుండగా అకస్మాత్తుగా రైలు వేగం పుంజుకుంది. దీంతో ప్రమాదవశాత్తు కాలు జారడంతో రైలుకింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. రైలు కనీసం నిమిషం పాటు ఆగినా వృద్ధురాలి ప్రాణాలు దక్కేవని అక్కడున్న పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ...

మానకొండూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన బొడ్డు పోచమ్మ (85) అగ్నిప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన పోచమ్మ ఆదివారం సాయంత్రం ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మంటలు పోచమ్మకు అంటుకుని తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు పోచమ్మను కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందింది. తన తల్లి మృతిపై అనుమానం ఉందని పోచమ్మ కుమార్తె అలువాల లచ్చమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

బావిలో దూకిన వృద్ధురాలు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన కొండ బత్తిని రాజేశ్వరి(65) బావిలో దూకింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్వరి భర్త రాజాకిషన్ గత14 సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు సేవ చేస్తూ మనస్తాపానికి గురైన రాజేశ్వరి సోమవారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మోటార్ల సహాయంతో నీటిని తోడుతున్నారు. సాయంత్రం వరకు మృతదేహం లభించలేదు.

కొడుకు మృతి తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

ఇల్లందకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కోమటిపల్లి గ్రామానికి చెందిన మూడెండ్ల రవి (48) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రవి కుమారుడు రెండు నెల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి రవి ముభావంగా ఉంటున్నాడు. ఈ నెల 16న పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి రాత్రి అక్కడ పురుగుల మందు తాగాడు. తెల్లవారు జామున గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. రవిడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన సురెడ్డి దేవి ప్రసాద్‌రెడ్డి (50) అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవి ప్రసాద్‌రెడ్డి కొన్నేళ్లుగా కాటారం మండలం గంగారంలో నివాసముంటూ హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్నాడు. తనకు పెద్దపల్లిలో సొంత ఇళ్లు ఉంది. ఆ ఇంటిని గణేష్‌రెడ్డి అనే వ్యక్తి ఐదు లక్షల రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకొని అద్దె లేకుండా ఇళ్లు అప్పగించాడు. సోమవారం పెద్దపల్లికి వచ్చిన ప్రసాద్‌రెడ్డి గణేష్‌కు ఫోన్‌చేసి ఇంటి తాళాలు తెప్పించుకొని నాలుగు గంటల వరకు ఇక్కడే ఉంటానని.. తర్వాత వచ్చి ఇంటికి తాళం వేసుకోమని గణేష్‌కు చెప్పాడు. దేవీప్రసాద్‌రెడ్డి భార్య రమ భర్తకు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. నాలుగు గంటల సమయానికి గణేష్ వచ్చి డోర్లు కొట్టినా దేవీప్రసాద్‌రెడ్డి తలుపులు తీయకపోవడంతో కిటికిలోంచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఏఎస్సై రామస్వామి వచ్చి ఘటన వివరాలు సేకరించారు. దేవి ప్రసాద్‌రెడ్డి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి కేసులో ఐదుగురు నిందితులకు జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో 2020, నవంబరు 10న జ్యోతినగర్‌లోని శివ టాకీసు వద్ద వాహనాల తనిఖీలో గంజాయితో పట్టుబడిన నిందితులకు కరీంనగర్ జిల్లా ఫస్ట్ అడిషనల్, సెషన్స్ కోర్టు సోమవారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. కరీంనగర్ రెండో టౌణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుల్లో ఒకరైన జాడి అజయ్ చనిపోగా, మిగిలిన నిందితులు సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలానికి చెందిన ఎర్రోల్ల రమేశ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన అన్నం కృష్ణ, రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన దుర్గం శ్రీధర్, కొత్తపల్లికి చెందిన మాడిశెట్టి రాజ్‌కుమార్‌లకు కోర్టు 5 ఏళ్ళ జైలుశిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట రూరల్, నవంబర్ 18: జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనిలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. రాజేందర్ అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి స్వగ్రామం చెల్పూర్‌కు వెళ్లాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి పదితులాల వెండి, ఐదు గ్రాముల బంగారు కమ్మలు, వెండి ప్రమిదలు, దుస్తులు ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ. 98 వేలు ఉంటుందని, ఇంటి యాజమాని ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

మహిళపై తెగిపడిన కరెంటు తీగ

- తప్పిన పెనుప్రమాదం

సుల్తానాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్యాంక్ రోడ్‌లో జన నివాసంలో ప్రమాదకరంగా ఉన్న ఎస్ఎస్-1 ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెంట రేణుక అనే మహిళ మీద కరెంటు వైర్ తెగి పడింది. సోమవారం ఉదయం మహిళా తన ఇంటి ఎదుట వాకిట్లో ముగ్గు వేస్తుండగా కరెంటు తీగ తెగిపడింది. తీగ ఆమె చీర చివరను తాకుతూ వెళ్లడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఆమె చీర కొంత వరకు కాలగా, చుట్టు పక్కల వాసులు ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు ఎవరి ప్రాణాలు బలిగొంటుందో అని భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఇదివరకు కూడా జరిగాయని, కేవలం ప్రత్యామ్నాయ పనులు మాత్రమే చేస్తున్నారని, శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని వారు కోరుతున్నారు. అధికారులు పట్టించుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని విద్యుత్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

బైండోవర్ ఆంక్షలు ఉల్లంఘన

- లక్ష రూపాయల జరిమానా

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని బొంపెల్లి గ్రామానికి చెందిన బోదాసు కనుకలక్ష్మి అనే మహిళ గుడుంబా విక్రయించినందుకు తహసీల్దార్ లక్ష రూపాయల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విధించిన బైండోవర్ అంక్షలన ఉల్లంఘించినందున జరిమానా వేసినట్లు తెలిపారు. ఎవరైన గుడుంబా విక్రయించిన, రవాణ చేసిన, తయారు చేసిన లక్ష రూపాయల జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష విధించబడుతుందని సీఐ హెచ్చరించారు.

సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు

- రేపు 'రాజన్న' దర్శనం.. బహిరంగ సభ
- గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా
- యారన్ డిపో, ఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవం
- రూ.126 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం





వేములవాడ గుడి చెరువు మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లు



సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఇప్పటికే బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఏర్పాట్లపై దృష్టి సారించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం వేములవాడకు హెలికాప్టర్ ద్వారా చేరుకొని రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం గుడి చెరువు మైదానంలో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఇదే క్రమంలో రూ.126 కోట్లతో వేములవాడ దేవస్థానానికి సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. నిధులకు సంబంధించిన జీవోలు కూడా సోమవారం జారీ చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన 12 గ్రామాల నిర్వాసితులకు సంబంధించి 4696 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి రూ.237 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీటికి సంబంధించి ప్రొసీడింగ్‌లు అదించే అవకాశం ఉంది. ఎంతో కాలంగా నేత కార్మికులు ఎదురుచూస్తున్నా యారన్‌డిపోను ప్రారంభించనున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జీ-ప్లస్ 2 విధానంలో అధునిక వసతులతో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని వేములవాడ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. పోలీస్ కార్యాలయం ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడడం గమనార్హం. ముఖ్యమంత్రి రాకకు సంబంధించి వేములవాడలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హెలీప్యాడ్ తోపాటు భారీ షామీయానాలు సిద్ధం చేశారు.

గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే గల్ఫ్ కార్మికులు, ఎన్ఆర్ఐల సంక్షేమంపై పాలసీ తీసుకొస్తామని ప్రకటించింది. ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ బాధిత కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించడానికి శ్రీకారం చుట్టింది. డిసెంబరు 7, 2023 నాటి నుంచి గల్ఫ్‌లో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.5లక్షల అర్థికసహాయం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం వేములవాడలో బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 17కుటుంబాలకు చెక్కులు అందించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.85 లక్షలు కేటాయించింది. జిల్లాలో గల్ఫ్‌లో మృతిచెందిన కార్మికుల్లో గంగిపెల్లి తిరుపతి, దాసరి బాబు, కైర నాగయ్య, పోతుగంటి భూమయ్య, భైరి వెంకటేశం, ఎనుగుల భాస్కర్, బోయిని గణేష్, కారవాణి దేవయ్య, వికృర్తి ఎల్లంగౌడ్, పిట్ల మహేష్, గెరిగంటి అంజయ్య, సిలివేరి నాంపల్లి, దురిశెట్టి కొండయ్య, పెండ్యాల చంద్రకాంత్, మాదాసు విజయ్, పల్లి అంజయ్య, నిమ్మలరాజు ఉన్నారు. వీరి కుటుంబాలకు ముఖ్య మంత్రి చేతులమీదుగా చెక్కులు అందించే ఏర్పాట్లు చేశారు.

ధాన్యం కొనడం లేదని రైతుల ఆందోళన

- గోనె సంచులకు నిప్పుపెట్టి నిరసన

సైదాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) వద్ద గోనెసంచులు యివ్వడం లేదని రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. అసహనానికి గురైన రైతులు గోనె సంచులను గడ్డిలో వేసి సొసైటీ గేటు ఎదుట తగలబెట్టి నిరసన తెలిపారు. చైర్మన్ బిల్ల వెంకట్రెడ్డిని సంచులు ఎందుకు ఇవ్వడం లేదని, ధాన్యం తూకాలు వేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని రైతులు నిలదీశారు. వెంటనే ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు తెప్పించడం లేదని, ట్రాక్టర్ తో ధాన్యం తరలించడం వల్ల రైతులపై రవాణా చార్జీలు అదనంగా పడుతున్నాయని రైతులు తెలిపారు. సొసైటీలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, దానిపై విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. పది రోజులుగా రైతులు ఇబ్బంది పడుతుంటే పై అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు గాని ఎందుకు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సొసైటీ చైర్మన్, పాలకవర్గం, సిబ్బందిపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

కోరుట్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు సోమవారం దేవాలయ శాఖ, గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. దేవాలయ - ధర్మాదాయశాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి పర్యవేక్షనలో ఆలయ ఈవో విక్రం ఆధ్వర్యంలో హుండీ సొమ్ము లెక్కించారు. దేవాలయ ఆదాయం రూ. 73,365 నగదు, మిశ్రమ బంగారం 2 గ్రాముల 300 మిల్లీ గ్రాములు, మిశ్రమ వెండి 80 గ్రాములు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి, దేవాలయ పురోహితుడు వెంకటరమణ, దేవాలయ చైర్మెన్ కటుకం రాజేశం, గ్రామస్థులు, భక్తులు ద్యాగ రాజిరెడ్డి, పోతుగంటి రాజేశం గౌడ్, పిట్టల రమేష్, బక్కం నర్సయ్య పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన



కూతురు, కుమారుడితో కలిసి ఆందోళన చేస్తున్న వనిత

కోరుట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పిల్లలతో పాటు తనను మానసిక వేదనకు గురిచేస్తూ మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని ఆరోపిస్తూ భర్త ఇంటి ఎదుట వివాహిత తన పిల్లలతో సోమవారం ఆందోళకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల పట్టణానికి చెందిన వినోద్ కుమార్‌తో 24 ఏళ్ల క్రితం పట్టణానికి చెందిన వనితకు వివాహం అయింది. దంపతులకు కొడుకు మనీష్, కూతురు మాళవిక ఉన్నారు. మూడేళ్ల క్రితం నుంచి భర్త వినోద్ కుమార్ పిల్లలతో పాటు భార్య వనితను మానసికంగా హింసిస్తున్నాడు. వేధింపులు భరించలేక వనిత తన పిల్లలతో కలిసి పట్టణంలో మరో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. నాలుగు నెలల క్రితం వినోద్ కుమార్ మరో మహిళను వివాహం చేసుకున్నాడని తెలుసుకున్న వనిత భర్తను నిలదీసింది. తనకు తెలియకుండా మరో పెళ్లి చేసుకున్నాడని, ఇంటి ఖర్చులకు కూడా డబ్బులు ఇవ్వడం లేదని తనకు న్యాయం చేయాలని సోమవారం ఆందోళనకు దిగింది. వివాహిత చేస్తున్న ఆందోళనకు మహిళా సంఘ సభ్యులు మద్దతు పలికారు. ఆందోళ చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడ చేరుకుని ఆమెను సముదాయించి ఆందోళన విరమించాలని సూచించారు. అనంతరం పోలీసులు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిచేశారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక



దిలీప్

బీర్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైయ్యాడు. బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామం నుంచి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన గోండుగుడెం గ్రామపంచాయతీకి చెందిన శకుంతల దిలీప్ ములుగు జిల్లాలో ఇంటర్ రెండవ సంవత్సం చదువుతున్నాడు. దిలీప్‌కు చిన్నా నాటి నుంచి కబడ్డీ అంటే ఇష్టం ఉండంతో క్రీడలపై ఉన్న మక్కువతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలను సాధించి హర్యానా రాష్ట్రంతో జరుగబోయే జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యాడు. అంతే కాకుండా రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం (కెప్టెన్)గా బాధ్యత వహిస్తున్నాడు. దిలీప్ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికై రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండడంతో తల్లి దండ్రులు, స్నేహితులు, మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోనల్ మీట్‌లో గురుకులం విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

తంగళ్లపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో నిర్వహించిన తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల 10వ జోనల్ మీట్‌లో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ఖో, ఖోలో ప్రథమస్థానం, అండర్-17 విభాగంలో బ్యాడ్మింటన్ జట్టు ప్రథమస్థానం, అండర్-19 విభాగంలో బ్యాడ్మింటన్ జట్టు ప్రథమ స్థానాల్లో నిలిచాయి. హ్యాండ్‌బాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. అథ్లెటిక్స్ అండర్-17లో హైజంప్‌లో రుషిత గోల్డ్‌మెడల్, డిస్క్ త్రోలో శరణ్య సిల్వర్ మెడల్, 3కే రన్‌లో సుచరిత సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సదర్భంగా సోమవారం మార్నింగ్ అసెంబ్లీలో ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ రమ్యకృష్ణ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వింధ్య మాలతి, పీడీ అలేఖ్య, పీఈటీ జ్యోతి విద్యార్థినులను అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సైరన్ వేసుకొని వెళ్తున్న ఒక కారు డ్రైవర్‌తో పాటు రాయల్ ఎన్‌ఫీల్డ్ సైలెన్సర్ మార్చి తిరుగుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

విగ్రహాల తయారీతో ఉపాధి

- మహనీయులు, దేశ నేతలు, దేవుళ్ల విగ్రహాల తయారీ

వేములవాడటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి చిత్రకళ ఇష్టం. దానితోపాటు మట్టితో విగ్రహాలను చేయడం అలవాటుగా చేసుకున్నాడు. ఇప్పుడు అదేకళను ఉపాధిగా మార్చుకున్నాడు. దేశ నేతలు, దేవుళ్ల విగ్రహాల తయారీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. వేముల వాడ మండలం సంకెపల్లికి చెందిన బుర్రవేణు చిన్నప్పటి నుంచి చిత్రకళ, శిల్ప కళపై దృష్టి సారించాడు. పెద్దపల్లి సత్యంఅనే సీనియర్ శిల్పకారుడి వద్ద చేరి శిల్పకళలోని మెళకువలను తెలుసుకున్నాడు. చిత్రకళలో పోటీ ఎక్కువగా ఉండడంతో వేణు విగ్రహాల తయారీవైపు దృష్టిసారించాడు. మహనీయులు, దేశ నేతలు, దేవతల విగ్రహాల తయారీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. దేశ నేతలైనగాంధీ, అంబేద్కర్, అల్లూరి సీతరామారాజు, చత్రపతి శివాజీ విగ్రహాల తయారీతో అందరి దృష్టిని ఆకర్షించాడు. అతడితోపాటు మరో ఎనిమిది మంది యువకులకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తమిళనాడు, మహారాష్ట్రతో పాటుగా తెలుగు రాష్ట్రాల్లోని నిజామాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, హైదారాబాద్, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, కర్నూల్, కడప, విజయవాడ జిల్లాలో సుమారుగా 1800 వరకు విగ్రహాలను తయారు చేసినట్లు వేణు తెలిపాడు.



నాలుగు సింహాల విగ్రహం



శివుడి విగ్రహంతో బుర్ర వేణు



బుర్ర వేణు తయారు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహం

పలువురికి ఉపాధి కల్పిస్తున్నా..

మాది నిరుపేద గీతకార్మిక కుటుంబం. మొత్తం ఆరుగురం సభ్యులం. చిన్నతనం నుంచి చిత్ర కళ ఆసక్తి. కుటుంబ పరిస్థితి బాగాలేక శిల్పాలు తయారీ నేర్చుకున్నా. అన్ని జిల్లాల నుంచి ఆర్డర్లు వస్తాయి. ప్రస్తుతం పలువురికి ఉపాధి కల్పిస్తున్నా.

- బుర్ర వేణు, శిల్పకారుడు, సంకెపల్లి



నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులు



నిరాశ్రయుల వసతి గృహం

నీడలేని వారికి అండగా..

- అభాగ్యులను ఆదుకుంటున్న నిరాశ్రయుల వసతి గృహం
- 30 మందికి భోజన వసతి

కరీంనగర్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేగు తెంచుకొని పుట్టిన ఎంతోమంది కన్నబిడ్డలే తల్లిదండ్రుల ఆలనాపాలన చూడని ప్రస్తుత రోజుల్లో ఎవరూ లేని అభాగ్యులకు అండగా నిలుస్తోంది కరీంనగర్‌లోని నిరాశ్రయుల వసతి గృహం... మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ భవనంలో ఏర్పాటు చేసిన నగర నిరాశ్రయుల వసతి గృహం ఎంతో మంది అభాగ్యులను అక్కున చేర్చుకుంటోంది. నగరంలోని కోతిరాంపూర్‌లో రెండంతస్తుల భవనంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఓ స్వచ్ఛంద సంస్థకు ఈవసతి గృహం నిర్వహణ బాధ్యతను అప్పగించగా వారు అభాగ్యులను అక్కున చేర్చుకొని వారికి భోజనంతోపాటు వసతి కల్పించారు. నగరంలోని రోడ్ల పైనే నిద్రించేవారికి, ఇక్కడికి వివిధ అవసరాల మేరకు వచ్చి రాత్రికి ఇళ్లకు వెళ్లలేక రాత్రి బస చేయాలనుకునే వారికి నైట్ షెల్టర్‌గా ఈ వసతి గృహాన్ని వినియోగిస్తున్నారు. రోడ్ల పక్కన, జంక్షన్లలో, బస్టాండ్లలో రాత్రి పడుకునే అనేక మందిని పోలీసులు ఈ వసతి గృహానికి తరలిస్తారు. వారికి రాత్రి బస కల్పించి, ఉదయం వారిని బయటకు పంపిస్తారు. ఇలా దాదాపు 10 సంవత్సరాలుగా నీడలేని వారికి అండగా నిలిచిస్తోంది.

● వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

2023 నవంబరునుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ గృహంలో 15 మంది ఎవరూ లేని అభాగ్యులు ఆశ్రయం పొందుతున్నారు, ప్రతిరోజు మరో 15 నుంచి 20 మంది వరకు నైట్ షెల్టర్‌కు వచ్చి నిద్రించి ఉదయమే వెళ్లిపోతున్నారు. మెప్మా ఈ వసతి గృహం వీబీ ఫౌండేషన్‌కు నెలకు కేవలం 40వేల రూపాయలు నిర్వహణ ఖర్చులకోసం ఇస్తోంది. గత ఏడాది నుంచి వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయాన్ని తీసుకోలేదు. అయి నా ఉదయం టిఫిన్స్, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో చక్కటి భోజనం, వసతి కల్పిస్తున్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించి అవసరమైన వారికి చికిత్సతోపాటు మందులు కూడా ఇప్పిస్తున్నారు. ఆశ్రయం పొందుతున్న 15 మందిలో నలుగురు మహిళలు కాగా, 11మంది పురుషుల. వీరిలో ఒకరు వంట మనిషిగా, మరొకరు హెల్పర్ గా సేవలందిస్తున్నారు.

● మూడేళ్లుగా ఉంటున్నా



ఎవరూ లేని నన్ను కరీంనగర్ బస్టాండ్ నుంచి తీసుకువచ్చి ఈ వసతిగృహంలో చేర్పించారు. మూడేళ్లుగా ఇక్కడే ఉంటున్నా... అన్ని వసతులు బాగానే ఉన్నాయి. నాకు కళ్ళు కనిపించడం లేదు.. ఆపరేషన్ చేయిస్తే బాగుండు..

\- రబీయా

● మూడు పూటలా భోజనం పెడుతున్నారు...



కొడుకులు, బిడ్డలు లేరు... యేడాది నుంచి నేను ఇక్కడనే ఉంటున్నా... భోజనం బాగుంటుంది. పొద్దున నాకు తిండి పెట్టి ఆశ్రయం ఇస్తున్నారు.. చల్లగా ఉండాలి.

\-నర్సమ్మ

కూలీ పనిచేసుకొని జీవిస్తున్నాను



కూలీనాలీ చేసుకొని జీవిస్తున్నాను... నాకు ఎవరూ లేరు.. ఆస్తిపస్తులు ఏమి లేవు.. సంవత్సరం నుంచి ఇక్కడే ఉంటున్నా. నాకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు కూడా లేవు.. ప్రభుత్వం ఇలా భోజనం పెట్టించి ఆదుకుంటుంది.

\- రేవెళ్ల శ్రీనివాస్

● అభాగ్యులకు సేవచేయడం అదృష్టం



కొన్ని సంవత్సరాలుగా హౌసింగ్‌బోర్డుకాలనీలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమం నిర్వహిస్తున్నాను.. అభాగ్యులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. మెప్మా పీడీ రవీందర్ గత నవంబర్‌లో ఈ వసతి గృహ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. వసతిగృహంలో ఉండే వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించాలని, రాత్రి వేళల్లో నైట్‌షెల్టర్‌గా రోడ్లపై నిద్రించే వారికి బస కల్పించాలని సూచించారు. నేను రాత్రి ఇక్కడికి వచ్చే వారికి కూడా భోజనం పెడుతున్నాను.. ఏడాది నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆర్థిక సహాయాన్ని అందిస్తే ఎంతమందికైనా ఇక్కడ వసతి కల్పించి సేవ చేస్తా.

\- సీపెల్లి వీరమాధవ్, వీబీ పౌండేషన్ చైర్మన్

ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ

- మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం
- మంత్రి పొన్నం ప్రభాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

గోదావరిఖని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్లలో బీజేపీతో స్నేహంచేసి ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీగా వ్యవహరించిందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం మహారాష్ట్రలోని రాజురకు ఎన్నికల ప్రచారనికి వెళుతున్న ఆయన రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో కలిసి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని, వారి దోస్తీ ప్రజలకు తెలుసునన్నారు. కేటీఆర్ మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని చెప్పడం పరోక్షంగా బీజేపీకి ఓటు వేయాలనే సంకేతాన్ని ఇచ్చారన్నారు. ఈ నెల 24న మహారాష్ట్రలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ కాంగ్రెస్‌కు కవచంగా ఉంటుందని మాట్లాడడం విడ్డూరంగా ఉందని, సిద్ధాంతాల పరంగా బీజేపీ కాంగ్రెస్‌కు బద్ధ శత్రువన్నారు. పదేళ్ల కాలంలో పార్లమెంట్‌లో బీజేపీ ఏ బిల్లు ప్రవేశపెట్టినా బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలికింది వాస్తవం కాదా అని అన్నారు. పదేళ్లలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ వేయగానే కేసీఆర్, కేటీఆర్ ప్రధాని నరేంద్రమోదీ శరణు కోరుతున్నారని, అవినీతితో కోట్లు దోచుకున్న కేసీఆర్, కేటీఆర్‌పై చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను ప్రజలకు నెరవేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సమావేశంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు దీటి బాలరాజు, ఎండీ ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, పాతిపెల్లి ఎల్లయ్య, గట్ల రమేష్, కళ్యాణి సింహాచలం, గుంపుల తిరుపతి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సెపక్ తక్రా రాష్ట్ర చాంపియన్స్‌గా ఉమ్మడి జిల్లా

- ఫైనల్స్‌లో రంగారెడ్డిపై గెలుపొందిన బాలబాలికల జట్లు



రాష్ట్ర చాంపియన్స్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు

కరీంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 సెపక్‌తక్రా రాష్ట్ర చాంపియన్లుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు విశేష ప్రతిభ చాటాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్లు బాల బాలికల విభాగంలో రంగారెడ్డి జట్లపై గెలుపొంది టోర్నమెంట్ చాంపియన్స్‌గా నిలిచాయి. బాలుర జట్టు నుంచి ఆర్ మోహన్ అభిరా నందన్, సాయి వర్ధన్, శ్రీరామ్, రెహమాన్‌లు పాల్గొని విజేతలుగా నిలవగా, బాలికల జట్టు నుంచి పూజ, అక్షయ, కవిత, హన్సిక, నక్షత్రాలు పాల్గొని విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించాయి. రాష్ట్ర చాంపియన్లుగా నిలిచిన బాలబాలికల జట్లకు కోచ్‌లుగా జి కుమార్, మేనేజర్‌గా శివకృష్ణలు వ్యవహరించారు. రాష్ట్ర చాంపియన్లుగా నిలిచిన జట్లను జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వి జనార్ధన్‌రావు, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్, సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు చెల్పూర్ విద్యార్థి ఎంపిక



సూత్రాల హర్షిత్

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న సూత్రాల హర్షిత్ అనే విద్యార్థి జాతీయ స్థాయి హాకీ పోటీకలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, పీడీ శ్రీనివాస్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హర్యానాలో ఈ నెల 22 నుంచి 27 వరకు జరగనున్న హాకీ పోటీల్లో హర్షిత్ రాష్ట్రం తరఫున ఆడతాడని తెలిపారు.



కోటిలింగాల వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

కోటిలింగాలలో వైభవంగా గోదావరి హారతి

వెల్గటూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య గోదావరి మాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి హారతి కార్యక్రమాన్ని తిలకించారు. ఆలయ ఈవో కాంతా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. పులకరించి పోయారు.

బైక్ అదుపు తప్పి వృద్ధుడి మృతి

కథలాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూలూరుకు చెందిన జూపాక పోచయ్య (62) అనే వృద్ధుడు బైక్ అదుపు తప్పి మృతి చెందాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... పోచయ్య ఆదివారం భూషణరావుపేట మల్లవ్వ దేవాలయం వద్ద ఓ శుభకార్యానికి హాజరై సాయంత్రం బైక్‌పై స్వగ్రామం బయలు దేరాడు. భూషణరావుపేట శివారులోని శ్మశాన వాటిక మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి పక్కన ఉన్న గోతిలోకి చొచ్చుకు వెళ్లింది. ఆ క్రమంలో అక్కడ ఉన్న చెట్టు రెమ్మలు తలకు తాకడంతో గాయాలయ్యాయి. రాత్రి దాకా అచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు రోడ్డు వెంట వెతికారు. కింద పడి అపస్మారకస్థితిలో కనిపించడంతో ఆసుపత్రికి తరలించే లోపే మార్గమధ్యలో మృతి చెందాడు. పోచయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో కార్తీక సందడి



ధర్మపురి వద్ద గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో మూడవ సోమవారం కార్తీక సందడి నెలకొంది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమారశర్మ స్వామి వారల ప్రత్యేకపూజలు జరిపించారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు.

●కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 17వ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు



హైకోర్టు రిజిస్ట్రార్ ఎంవీ రమేష్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనర సింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ ఎంవీ రమేష్ దంపతులు, జిల్లా అడిషనల్ జడ్జి నారాయణ వేర్వేరుగా సోమవారం సందర్శించారు. ఆలయం వద్ద వారిద్దరకి వేర్వేరుగా వేద పండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటాలు అందించి సత్కరించారు.

రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో కిటకిటలాడుతున్న రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడె మొక్కు చెల్లింపునకు సుమారుగా నాలుగు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ఆలయం ముందు భాగంలోని చెట్టు వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఈవో వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామూహిక కార్తీక దీపోత్సవం

కార్తీక మాసం సందర్భంగా రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం కొనసాగుతోంది. సోమవారం పట్టణానికి చెందిన మహిళలు పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం లో అర్చకులు మహాలింగార్చన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం చేపట్టారు. సాయంత్రం ఆలయ కల్యాణ మండపంలో అర్చకుల వేదమంత్రాల మధ్య పిండితో తయారు చేసిన దీపాలను లింగాకృతిలో వెలిగించారు.

● వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ సోమవారం రాజన్నను దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఈవో వినోద్ రెడ్డి సామి ప్రసాదాన్ని అందజేశారు.





రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు, కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హామీల అమలుపై రాజన్న సాక్షిగా ప్రకటన చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి రాజన్న సాక్షిగా ప్రకటించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేతన్నలకు ఉపాధిని కల్పించడంతోపాటు ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసి 11 నెలలు గడుస్తున్నాయని, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ప్రచారంలో ఇచ్చిన హామీ లను విస్మరించారని అన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. 11 నెలలుగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వకపోవడంతో నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. సరైన ఉపాధిలేక కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేక పోవడంతో ఇప్పటివరకు దాదాపు 20 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారని, దీనికి సీఎం బాధ్యత వహించాలని అన్నారు. 3 నెలల క్రితం ప్రకటించిన చీరల తయారీ ఆర్డర్లను వెంటనే అందించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడూరి ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, నాయకుల బొల్లి రాంమోహన్, ఎండీ సత్తార్, అగ్గిరాములు, గుండ్లపల్లి పూర్ణచందర్, కంచర్ల రవిగౌడ్, సబ్బని హరీష్, కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులను ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) మత్స్య కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుతారి బాలవ్వ ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జూలై, ఆగస్టులోనే ఉచిత చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉందని, నవంబరులో పంపిణీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2023 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు నెలలోనే చేప పిల్లలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా అప్పర్ మానేరు, అన్నపూర్ణ రిజర్వాయర్, మిడ్ మానేరుతోపాటు 440 చెరువులు ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం 1 కోటి 40 లక్షల చేప పిల్లలను పంపిణీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు కేవలం 75 లక్షల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేసిందన్నారు. జిల్లాలో 10వేల మందికి పైగా మత్స్య కార్మికులు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చేపపిల్లలతోపాటు రొయ్య పిల్లలను కూడ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆనవాళ్లు కోల్పోయిన ఎస్సారెస్పీ ఉపకాల్వలు

- నీటి విడుదల సమయంలో గండ్లు పడే ప్రమాదం - సబ్ మైనర్ కాల్వకు రూ.80 లక్షలు మంజూరు - నేటికీ టెండర్ కాని వైనం

ఓదెల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీసారి ఎస్సారెస్పీ కాల్వలకు నీటి విడుదల సమయంలో రైతులకు శాపంగా మారుతోంది. ప్రధాన డి 86 ఎస్సారెస్పీ కాల్వకు ఉన్న 12 మైనర్లు, 25 సబ్ మైనర్ ఉపకాల్వ లు ఇప్పుడు ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఏ కాలువ చూసినా చెట్లతో, పూడికతో నిండి కల్వర్టులన్నీ కూలిపోయి ఉన్నాయి. జీలకుంట శివారు నుంచి పొత్కపల్లి ఎల్లమ్మ ఆలయం మీదుగా పొత్కపల్లి, రూపు నారాయణపేట శివారు వరకున్న 49-ఆర్ ఉపకాల్వ పూర్తిగా శిథిలమై ఉపయోగం లేకుండా పోయింది. ఈ కాలువ ఆయకట్టు 43 మంది రైతులకు చెందిన 150 ఎకరాలకు ఇదే కాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. చెట్లు పెరిగి కల్వర్టులు లేకుండా పోవడంతో సాగునీరు విడుదల చేసినప్పుడల్లా నీరు నిలిచిపోయి ప్రతీసారి కాల్వకు గండ్లు పడి నీరంతా వృధా అవుతుంది. దీంతో సాగుచేసిన పంటలకు నీరందక పంట దిగుబడి రావడం లేదు. గత జూన్ 14న పొత్కపల్లి (గొల్లపల్లి) కి చెందిన గొడుగు అయిలయ్య అనే రైతు సంబంధిత ఏఈకి ఫిర్యాదు చేయగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో మరోసారి డీఈకి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుతం వరినాట్ల సీజన్ దగ్గర పడుతుండడంతో ఎస్సారెస్పీ కాల్వలకు సాగునీటి విడుదలపై అధికారులు కసరత్తును ప్రారంభించనున్నారు. మరోపక్క ఉపకాల్వలు, సబ్ మైనర్ కాల్వలు పూర్తిగా శిథిలమై పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. ముందస్తు మరమ్మతు లేకుంటే ఉపకాల్వలకు గండ్లు పడి సాగునీరు ఎవరికి ఉపయోగం లేకుండా పోయే



కాల్వ పనులకు ఖర్చు చేసిన నిధుల వివరాల బోర్డు

పరిస్థితి ఉంది. డి-86 ప్రధాన కాలువ నుంచి హరిపురం మీదుగా లంబాడి తండ, పెగడపల్లి వైపు, అలాగే ఓదెల, కొమిర, భీమరపల్లి, జీలకుంట, గూడెం, ఇందుర్తి, గుంపుల శివారు వైపు ఉన్న ఉప కాలువన్నీ పూర్తిగా శిథిలమైపోయాయి. వీటి మరమ్మతులు చేపట్టిన తర్వాతనే సాగు నీటిని విడుదల చేస్తే రైతులందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

● నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా..

డి 86 ప్రధాన కాల్వ నుంచి ఓదెల శివారు ఎగువన ఉన్న మడక వైపు వెళ్లే ఉపకాల్వ, మైనర్ కాల్వ మరమ్మతుల కోసం రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఉపకాల్వల్లోని పూడికతీత, చెట్ల తొలగింపు, కల్వర్టుల నిర్మాణం, శిథిలమైన తూముల నిర్మాణం తదితర పనులు చేపట్టాల్సి ఉంది. కానీ నిధులు మంజూరై నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ అగ్రిమెంటు, టెండర్లు నిర్వహించలేదు. దీంతో మంజూరైన నిధులు ఎవరికి ప్రయోజనం లేకుండాపోతున్నాయి. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి నిర్మాణానికి కసరత్తును ప్రారంభిస్తే సజావుగా సాగునీరు అందే పరిస్థితి ఉంటుందని రైతులు సూచిస్తున్నారు.

● కాల్వ నీటితోనే సాగు

- గొడుగు అయిలయ్య, గొల్లపల్లి



ఎస్సారెస్పీ కాల్వ నీటితోనే మా భూములను సాగు చేసుకుంటున్నాం. 49-ఆర్ కాల్వ పూర్తిగా శిథిలమైంది. రెండేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 1.55 లక్షల నిధులను ఖర్చుచేసి కూలీలతో కాల్వల మరమ్మతు చేసినప్పటికీ, ఈ కాల్వ రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. అధికారులు స్పందించి ఉపకాల్వల పనులు చేపట్టాలి.

● కాల్వ మరమ్మతు పనులు చేపట్టాలి

- ములుగు స్వామి, రైతు-పొత్కపల్లి



పొలాలు దున్నకముందే నుంచే కాల్వ మరమ్మతు పనులు చేపట్టాలి. ఎప్పుడు సక్రమంగా ఈ కాల్వ నుంచి సాగునీరు రాలేదు. అధికారులు స్పందించి ఈసారైన కాల్వ మరమ్మతులు చేపట్టి సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలి.

వ్యవ'సాయాని'కి కేంద్ర నిధులేవి?

(5వ పేజీ తరువాయి)

జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాని ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. ఈ పథకం కింద రైతుల వాటా కింద చెల్లించే బీమా మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. వానాకాలం సీజన్ నుంచి పంటల బీమా చెల్లిస్తామని చెప్పినప్పటికీ అమలు కాలేదు. దీంతో రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలను నష్టపోతున్నారు. కనీసం వచ్చే యాసంగి సీజన్‌లోనైనా పంటల బీమా పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

● భూసార పరీక్షలకూ దూరం

అలాగే సాయిల్ హెల్త్ కార్డు పథకానికి కూడా గడిచిన ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించకపోవడంతో భూసార పరీక్షలు చేయలేదు. భూసార పరీక్షలు చేయడం వల్ల ఆ నేలలో ఏఏ రకాల పంటలు పండించాలి, నత్రజని, భాస్వరం, పొటాష్ లాంటి ఎరువులు ఎంత మోతాదులో వేయాలో వ్యవసాయ శాఖాధికారురులు సూచిస్తారు. నిధులు లేక భూసార పరీక్షలు జరగడం లేదు. ఈ ఏడాదికి కొన్ని నిదులు కేటాయించగా జూలపల్లి మండలంలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 51 వేల రూపాయల వరకు వెచ్చించామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వ్యవసాయంలో యంత్రాల వినియోగాన్ని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచేందుకు ఆయా పథకాల కింద నిధులను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

ఎన్టీపీసీ కార్మికులకు స్వర్ణోత్సవ కానుక ఇవ్వాలి

జ్యోతినగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ స్వర్ణోత్సవాల సందర్భంగా కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం కానుక ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, ఎన్‌బీసీ(జాతీయ ద్వైపాక్షిక సంఘం) సభ్యుడు బాబర్ సలీంపాషా కోరారు. సోమవారం బాబర్‌పాషా ఎన్టీపీసీ ఆర్‌ఈడీ కేదార్ రంజన్ పాండును కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఎన్టీపీసీ అభివృద్ధిలో, నాణ్యమైన విద్యుత్ ఉత్పాదనలో శాశ్వత ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు కష్టపడి పనిచేస్తున్నారని బాబర్ అన్నారు. ప్రాజెక్టులో పనిచేస్తున్న నాలుగువేల మంది కార్మికులకు కనీసం కిలో స్వీట్స్‌ను పంపిణీ చేయాలని కోరారు. అలాగే పర్మినెంటు ఉద్యోగులకు డ్రై ఫ్రూట్స్‌ను పంపిణీ చేయాలని బాబర్ ఆర్‌ఈడీకి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ఎన్టీపీసీ ఆర్‌ఈడీ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌ఈడీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రాజెక్టు ఉద్యోగు లకు టీ షర్టులు పంపిణీ చేస్తోందని, ఈనెల 28న జరిగే ఎన్‌బీసీ సమావేశంలో ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు, సమస్యల పరిష్కారం, ఇతర అంశాలను యాజమాన్యం ముందు ఉంచుతామని ఆయన తెలిపారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్‌బాబు, అతడి సోదరుడు శ్రీనుబాబుపై అసత్యపు ఆరోపణలు చేయడం బీఆర్‌ఎస్ నాయకులు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. పనికట్టుకొని కావాలనే మంత్రి, ఆయన సోదరుడిపై బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ, రాజకీయ పబ్బం గడుపుతున్నారన్నారు. బీజేపీ నాయకుడు చల్ల నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కలిసి కట్టుగా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. అనంతరం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. చల్ల నారాయణ రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సయ్యద్ సయిద్ అన్వర్, రంగు సత్యనారాయణగౌడ్, ఎండి ఇంతియాజ్, శేవ్వ శంకరయ్య, భూంపెల్లి రాజయ్య, దాసరి గట్టయ్య, ఆడెపు రమేష్, ఎంఏ రఫీక్, గడప కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

హక్కుల సాధనకు పోరాటమే శరణ్యం

పాలకుర్తి,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేశోరాం కాంట్రాక్టు కార్మికులు దీపావళికి రావలసిన బోనస్, హక్కుల సాధన కోసం పోరాటమే శరణ్యమని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి కార్మికులకు పిలుపు నిచ్చారు. సోమవారం బోనస్‌పై కంపెనీ అధికారులతో కౌశిక హరి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు పూటకోమాట మార్చుతూ నాన్చివేత ధోరణి అవలంభిస్తున్నారన్నారు. హక్కుల సాధన కోసం జరిగే ప్రతీ పోరాటంలో ముందుండాలని సూచించారు. కార్మికుల పక్షాన హక్కుల సాధనకు యూనియన్ తీసుకునే నిర్ణయానికి ప్రతి కార్మికుడు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు బత్తిని సతీష్, పెరుమండ్ల రమేష్, తీగల తిరుపతి, సాధిక్, ప్రసాద్, కండె స్వామి, వెంకటేష్, అధికసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణ్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు గుండె వ్యాధులు పెరిగిపోతున్నాయని వాటిపై అప్రతమత్తంగా గుండె వ్యాధి నిపుణులు దీక్షిత్ సూచించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జనగామ గ్రామంలో ఉచిత గుండె వ్యాధి శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యంతో గుండె సంబంధిత వ్యాధులు పెరిగిపోతున్నాయని, దీనికి తోడు అకస్మాత్తుగా మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటున్నాయన్నారు. ఏడాదికి ఒకసారి గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోగులకు 2డీ ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికవర్ హెడ్ గుర్రం కిరణ్, మేనేజర్ కోట కరుణాకర్, హరీష్, యూనిస్, గుండబోయిన భూమయ్య, మల్లన్న, జనగామ శివ, తోకల రమేష్, సదన్ కుమార్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీఐ జిల్లా వెల్ఫేర్ సెక్రెటరీగా శాంతమ్మ



జ్యోతినగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్ ఆర్ సీఐ)కు చెందిన ఉమెన్ ఫోర్స్ జిల్లా వెల్ఫేర్ సెక్రెటరీగా అన్నపూర్ణ కాలనీకి చెందిన జగతి శాంతమ్మను నియామకం అయ్యారు. ఈ మేర కు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కుమార్ సోమవారం తెలిపారు. సంస్థ నిబంధనల మేరకు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని శాంతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.

యువతి ఆత్మహత్య

ధర్మారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తనకు ఇంకా పైచదువులు చదువుకోవాలని ఉందని, ఇప్పుడే పెళ్లి చేసుకోవడం ఇష్టలేదని కాల్వ సంధ్య (22) అనే యువతి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామానికి చెందిన కాల్వ సంధ్యకు ఆమె తల్లిదండ్రులు పెళ్లి చేయాలని నిర్ణయించారు. కానీ తనకు పైచదువులు చదవాలని ఉందని తల్లిదండ్రులకు తెలిపింది. తల్లిదండ్రులు సంధ్యకు నచ్చజెప్పి ఇదే నెలలో నిశ్చితార్థం చేసేందుకు సిద్ధపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన సంధ్య ఆదివారం రాత్రి తన గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సంధ్య తండ్రి కనుకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శీలం లక్ష్మణ్ తెలిపారు.

ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో వినతి - విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశం

పెద్దపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తన తండ్రికి ఓ ఆర్‌ఎంపీ ఇంజక్షన్ చేయడం వల్ల కాలు స్పర్శ కోల్పోవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడిందని వైద్యంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని ఎం శ్రీకాంత్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కోరడంతో విచారణకు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన అర్నకొండ నర్సయ్య తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన ఎం శ్రీకాంత్ తన తండ్రి రామయ్యకు అనారోగ్యం ఉంటే తన ఊరిలోని ఆర్‌ఎంపీకి చూపిస్తే ఇంజక్షన్ చేయడం వల్ల కాలు స్పర్శ, నడక కోల్పోయారని, కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం 26 వేల ఖర్చు అయ్యిందని, ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశాడు. దీంతో కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. రామగిరి మండలం, కల్వచర్ల గ్రామానికి చెందిన కుర్రొళ్ళ వాడ వీధి సభ్యులు కుర్రొళ్ళవాడ సందులో తాత ముత్తాతల నుంచి ఉన్న దారిని సదానందం అనే వ్యక్తి మూసివేస్తూ అడ్డంగా గోడ కడుతున్నాడని, దీనివల్ల దాదాపు 15 కుటుంబాలకు దారి ఉండదని, దీనిని నివారించేలా చూడాలని కోరారు. రామగిరి తహసీల్దార్‌కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ సర్వే


అబ్బాపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

జూలపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. మండల అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి ఎప్పటికప్పుడు సర్వే సిబ్బందికి తగిన సలహాలు సూచనలు అందిస్తుండడంతో మండలంలో కుటుంబ సర్వే శరవేగంగా సాగుతోంది. సోమవారం వరకు 85 శాతం సర్వే పూర్తి అయినట్లు ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 10,374 కుటుంబాలను గుర్తించగా 8802 కుటుంబాల సమగ్ర సర్వేను పూర్తిచేసినట్లు వారు పేర్కొన్నారు.

రామగిరి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగిరి పోలీస్‌స్టేషన్‌ను గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌కుమార్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో పిటిషన్స్ రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో తీసుకొవాల్సిన పలు అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఆయన వెంట మంథని సీఐ రాజు, ఎస్‌ఐ చంద్రకుమార్, సిబ్బంది ఉన్నారు.


ఏసీపీకి స్వాగతం పలుకుతున్న పోలీసులు

మాలల సింహ గర్జనను విజయవంతం చేయండి

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాలల సింహ గర్జనను డిసెంబరు 1న హైదరాబాద్ పరెడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో చైర్మన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి నల్లాల కనకరాజ్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ తెలంగాణలోని మాల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ వర్గాల వారంతా ఒకే కూటమిగా ఏర్పడి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకు ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా సమావేశాలు నిర్వహించి మాలలను సమాయత్తం చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సింహ గర్జనకు మాలలు తరలివచ్చి సభ విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బద్దం డానియల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కోదాటి రాజ కొమురయ్య, మండిగ రాజనర్సు, బొల్లం లక్ష్మణ్, కొండి సంజీవ్, రమేష్, మహేందర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

ధర్మారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్లుగా ధర్మారం మండల కేంద్రానికి జంగిలి సుధాకర్, మంజుల నియమితులయ్యారు. ఆయుష్మాన్ విభాగంలో ఖాళీగా ఉన్న యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి సెప్టెంబరులో ప్రాక్టికల్స్‌తో పాటు ఇంటర్వ్యూలు నిర్వహించగా సుధాకర్, మంజుల దంపతులు ఇరువురు 98 శాతం స్కోర్ సాధించారు. దీంతో వారిని ధర్మారం మండల కేంద్రంలోని ఆయుష్ హాస్పిటల్‌లో యోగా ఇన్‌స్ట్రక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఆయుష్ కేంద్రానికి వచ్చే రోగులకు అవసరమైన యోగా ద్వారా వ్యాధి నయంచేసేందుకు కృషి చేస్తారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఆయుష్ ఇన్‌చార్జి డాక్టర్ అరుణ, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విద్యాసాగర్, డాక్టర్ కేశవరెడ్డి, డాక్టర్ మారుతి పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యలను పరిష్కరించాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ, ఎస్సీ ఎస్టీ, ఈబీసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కోయ శ్రీ హర్షకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ కనకం గణేష్ మహరాజ్ మాట్లాడుతూ ప్రజలందరికీ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని, ప్రతీ గ్రామంలో ఆధునిక ఆసుపత్రిని నిర్మించాలని కోరారు.

అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యం ఉన్న ఎకరం భూమిని ఇవ్వాలని, అర్హులైన వారందరికీ 200 గజాల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పథకాలకు మహాత్మ పూలే, అంబేద్కర్, సాహు మహరాజ్, కాన్షీరామ్ మహనీయుల పేర్లు పెట్టి ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. పేద ప్రజల జీవితాల్లో సామాజిక సాంస్కృతిక ఆర్థిక మార్పును తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆవునూరి సతీష్, ఏదుల్ల శంకరయ్య, క్యాదాసి రమేష్, మాతంగి రేవంత్, ఆషాడం ముకేష్ , విక్రమ్, ఏదుల్ల ప్రవీణ్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముదిరాజ్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ధి ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం ముదిరాజ్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ నవంబరు 21న ప్రపంచ మత్స్యకారుల దశాబ్ధి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు దాసరి రమేష్, నాయకులు కలవేన రమేష్, రేకుల రఘు, కందుల శ్రీనివాస్, పోతరవేన శ్రీనివాస్, నాగరాజు, రవీందర్, రమేష్, సాంబయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవునిపల్లి ఆలయంలో ఎంపీడీవో పూజలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునిపల్లి శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి ఎంపీడీవో శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈనెల 20న నిర్వహించనున్న జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి సదయ్య, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో ఉదయ 11గంటలకు దేశభక్తి జానపద గేయాల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని తమ గానం వినిపించారు. ఇంచార్జి కార్యదర్శి కె. కరుణ కుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లస్టర్ సీఆర్పీ బాలసాని వెంకటేశం, పాఠశాల కళాశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గ్రంథాలయ సిబ్బంది మహమ్మద్ గఫార్, స్వరూప, శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.

వరి కొయ్యల దహనంతో భూసారం తగ్గుతుంది

- ఏడీఏ శ్రీనాథ్


ఓదెలలో పంట క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనాథ్

ఓదెల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరి పంటలు పూర్తికాగానే రైతులు వరి కొయ్యలను దహనం చేయడం వల్ల భూసారం తగ్గుతుందని ఏడీఏ శ్రీనాథ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏడీఏ శ్రీనాథ్, ఏవో భాస్కర్ వరిపంటల కోత పూర్తయిన క్షేత్రాలను సందర్శించారు. అనంతరం అక్కడున్న రైతులకు అవగాహన కల్పిస్తూ వరికొయ్యలను దహనం చేయడం వల్ల తీవ్రమైన కాలుష్యం వెదజల్లుతుందని, అలాగే భూమిలోని మిత్ర పురుగులు చనిపోయి చెడు చేసే కీటకాలు అధికమవుతాయని తెలిపారు. వరి పంటలు పూర్తికాగా కొయ్యలను కాల్చకుండ భూములను దున్నుకొని ఎకరాకు 50 కిలోల సూపర్, 12 కిలోల యూరియా చల్లుకోవాలని, దీని ద్వారా కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి పంటకు పోషకాలు అందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు సంధ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలు కాల్చితే పంట భూసార నష్టంతో పాటు వాయు కాలుష్యం, గాలి కాలుష్యం పెరుగుతుందని రైతులు పంట పొలంలోనే వరికొయ్యలు మురగ పెట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బండి ప్రమోద్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో రైతులకు సూచించారు. యాసంగి పంట సాగుకు సిద్ధమవుతున్న రైతులు ప్రస్తుతం కోసిన తర్వాత వరి కొయ్యలను పొలంలోనే కాలుస్తున్నారని అలా చేయడం వల్ల నేల సారం కోల్పోతుందని అన్నారు. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నాశనం అవుతాయని తెలిపారు. వరి కొయ్యలు కాల్చకుండా భూమిలో మురగ పెడితే పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): వరికోతలు పూర్తయిన తర్వాత వరి కొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల్చడం వలన నష్టాలు అధికంగా ఉన్నాయని, వాటిని కలియ దున్నడం వల్లన లాభాలు అధికంగా ఉన్నాయన్నారు. కాల్చడం ద్వారా మట్టిలో నాణ్యత బలహీన పడుతుందని తెలిపారు.

ఉత్పత్తిలో యంత్రాల నిర్వహణ కీలకం


ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిని సన్మానిస్తున్న ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి ప్రక్రియలో యంత్రాల మెయింటనెన్స్ కీలకమని ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి జింగిటి రాజశేఖర్ అన్నారు. పీవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి సోమవారం బేస్‌వర్క్ షాప్‌ను రాజశేఖర్ సందర్శించారు. సకాలంలో యంత్రాల మెయింటనెన్స్ పూర్తి చేయడం, అందుబాటులో ఉంచడం వలన ఉత్పత్తికి ఆటంకం ఏర్పడకుండా ఉంటుందని అన్నారు. ఓసీపీ-1 ప్రాజెక్టు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలవడంలో బేస్‌వర్క్ షాప్‌లో ఉద్యోగుల భాగస్వామ్యం ఉన్నదని పీవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీవోను ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్ హరిజన్, పీఈ ఉదయ్ భాస్కర్, హెచ్‌వోడీ సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ ఏఐటీయూసీ నాయకులు జక్కుల దామోదర్ రావు, నక్క రమేష్ పాల్గొన్నారు.

'అభివృద్ధిని జీర్ణించుకోలేని మాజీ ఎమ్మెల్యే'


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా రామగుండం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ గెలిచిన తరువాత రామగుండాన్ని అభివృద్ధి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే చందర్ జీర్ణించుకోలేకపోతున్నాడని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, 11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని విమర్శించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొద్దిరోజులుగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రామగుండంలో అభివృద్ధి పనులు చేపడితే వాటిపై చందర్ పనిగట్టుకొని విమర్శలు చేస్తున్నాడని ఆరోపించారు. రామగుండంలో పోలీసు రాజ్యం నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. గుడి విషయంలో అక్కడి ప్రజలు డిప్యూటీ మేయర్‌ను వ్యతిరేకించారని, దీనికి ఎమ్మెల్యేకు సంబంధం ఎలా ఉంటుందని వారు ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పెద్దెల్లి ప్రకాష్, నాయిని ఓదెలు, అల్లి శంకర్, కళ్యాణి సింహాచలం, మొహిద్ సన్ని తదితరులు పాల్గొన్నారు.

'మత విద్వేషాలు రెచ్చగొడుతున్న డిప్యూటీ మేయర్'

కళ్యాణ్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుడి భూమి విషయంలో డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, అతని తండ్రి సాగర్‌రావు మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారని బాధితులు తొగరి శ్రీనివాస్‌తో పాటు కాలనీవాసులు సారయ్య, భాగ్య, శోభ, రాజమ్మ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2005లో ఎన్‌టీపీసీ కృష్ణానగర్‌లో నాలుగు గుంటల భూమిని తాను కొనుగోలు చేశానని, ఆ భూమి వెనుక సాగర్, అభిషేక్‌రావు, ఇతరులు కలిసి తమకు రెండు గుంటల భూమి ఉందని చెప్పి అక్కడ గుడి నిర్మించాలనే ఉద్దేశంతో తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. తన భూమిని గుంజుకోవడానికి తండ్రీకొడుకులు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము క్రిస్టియన్లమని ముద్ర వేసి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో రాజమ్మ, విద్య, హేమంత్, సమ్మయ్య, వంశీ, విజయ పాల్గొన్నారు.